క్లుప్తంగా

విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించాలి



నాదెండ్ల: విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని నాదెండ్ల పీహెచ్‌సీ 108 వైద్యాధికారి డాక్టర్ జడ జతిన్‌దేవ్ చెప్పారు. నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చిలకలూరిపేట యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కెనడీ, కోశాధికారి ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్స్ ట్రోఫీ ఫైనల్‌కు ఈపూరు ఉద్యోగుల జట్టు



ఈపూరు: పల్నాడు జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కలెక్టర్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఈపూరు మండల ప్రభుత్వ ఉద్యోగుల జట్టు ప్రతిభ కనబరిచింది. జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈపూరు మండల ప్రభుత్వ ఉద్యోగుల జట్టు, వినుకొండ అర్బన్ జట్టుపై ఘన విజయం సాధించింది. సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచి నరసరావుపేట డివిజన్ నుంచి ఈపూరు మండల జట్టు ఫైనల్‌కి వెళ్లడం జరిగింది.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం


వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం, అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు వినుకొండ పురపాలక సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సాధారణ సమావేశంలో 2023–24 సంవత్సర సాధారణ బడ్జెట్, మున్సిపల్‌కు సంబంధించిన ఆశీలు వసూళ్ల పాటలపై, పలు అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 38 అంశాలపై సమీక్షా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే అత్యవసర సమావేశంలో పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల ఎన్ఎస్‌పీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై, స్థలంలో తొలగించిన భవనాలు, శిథిల భవనాలకు, ఖాళీ స్థలానికి సంబంధించి ఆస్తి పన్నుపై చర్చించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని బాపట్ల జిల్లా వాసి మృతి

శావల్యాపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన యరమనేని కోటేశ్వరరావు (39) నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో వ్యక్తిగత పనులు చూసుకొని తిరిగి వినుకొండ వైపునకు బైకుపై బయలుదేరారు. శావల్యాపురం హైస్కూల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. యరమనేని కోటేశ్వరరావు తల, కాలుకు బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కల్లంలో మిర్చి మాయం

పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతు



యడ్లపాడు: రాసిపోసిన మిర్చిలో కొంత భాగంగా మాయమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామానికి చెందిన మిర్చి రైతు కల్లూరి శ్రీనివాసరావు సుమారు 15 క్వింటాళ్ల మిర్చిని పొలంలో రాసిగా పోసి పరదా కప్పిఉంచాడు. యడ్లపాడు పీహెచ్‌సీ వెనుక 16వ నంబర్ హైవే సర్వీసు రోడ్డుకు చేరుకునే ఈ డొంక మార్గంలో ఖాళీ ప్రదేశంలో ఉంచి గోతాల్లోకి తొక్కించేందుకు మిర్చిని ఉంచాడు. వీటి పక్కనే మరి కొన్ని టిక్కీలను పెట్టాడు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడికెళ్లి చూడగా పరదా చినిగి, వాటి పక్కనే మిర్చి చెల్లాచెదురుగా కనిపించింది. టిక్కీల్లో రెండు తగ్గడంతో అంతా పరిశీలించి చూశాడు. గుర్తుతెలియని దుండగులు అపహరణ చేసినట్టు గుర్తించి యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా రాములోరి కల్యాణం



పట్టాభిరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ధర్మకర్త సుబ్బరాయగుప్తా దంపతులు



శావల్యాపురంలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న దంపతులు



సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే దంపతులు



చిలకలూరిపేటలో సీతారాముల కల్యాణ వేడుకలో భక్తులు

నరసరావుపేట ఈస్ట్: రాములోరి కల్యాణాన్ని గురువారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. పట్టాభిరామస్వామి ఆలయంలో ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధ దంపతులు స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల ఉత్సవమూర్తులకు ఆగమ పండితులు అభిజిత్ లగ్నంలో కల్యాణం జరిపారు. వడియరాజుల బజారులోని సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో అమ్మవారికి ఓర్సు గోవిందరావు దంపతులు బంగారు మంగళసూత్రాలను సమర్పించి కల్యాణం జరిపారు. మండవారి సీతారామస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామి సన్నిధి, పాతూరులోని మదట్లూరి ఆంజనేయస్వామి ఆలయం, బరంపేటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాల్లో రాములోరి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

నరసరావుపేట రూరల్‌లో..

నరసరావుపేట రూరల్: శ్రీరామ నవమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పాలపాడు, దొండపాడు, జొన్నలగడ్డ, రంగారెడ్డిపాలెం, రెడ్డినగర్, రావిపాడు, లింగంగుంట్ల, కేసానుపల్లి, యల్లమంద, గురవాయపాలెం, పెట్లూరివారిపాలెం, కాకాని, అర్వపల్లి, ఇక్కుర్రు, అల్లూరివారిపాలెం, ములకలూరు, పమిడిపాడు గ్రామాల్లో నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండల ప్రజలు శ్రీరామనవమి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వి.రెడ్డిపాలెంలోని సీతారామస్వామి, పట్టాభిరామస్వామి ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాల్లో శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు. సీతారామస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి: మండలంలోని సోలాయపాలెం, మూగచింతలపాలెం గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా తిరునాళ్ల నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎంపీపీ బత్తి రాములు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బొల్లా గిరిబాబు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కనుల పండువగా సీతారామ కల్యాణం

చిలకలూరిపేట: శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని చలివేంద్రంబజార్, గ్రంథాలయం బజారు, మార్కెట్ సెంటర్, పొట్టి శ్రీరాములు వీధి, తవ్వా బాపనయ్య వీధి, రెడ్ల బజార్, మద్దిమల్లయ్యవీధి, మార్కాండేయనగర్ తదితర చోట్ల చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. నవమి వేడుకలను పట్టణంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.

కొత్తపేటలో నవమి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొత్తపేటలోగల సీతారామాంజనేయస్వామి దేవస్థానం (అవ్వగారి గుడి) ఆవరణలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, ఇర్లపాడు, కొత్తలూరు, గుర్రంవారిపాలెం, కనమర్లపూడి, వయ్యకల్లు, గంటుపాలెం, మతుకుమల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శావల్యాపురం కోదండరామస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు. పలుగ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆనంద ధామం.. రామ నామం

యడ్లపాడు: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను యడ్లపాడు మండలంలో వైభవంగా నిర్వహించారు. అన్ని గ్రామాలు, ఆలయాల్లో పండుగ సందర్భంగా సందడి నెలకొంది. యడ్లపాడు, బోయపాలెం, ఉన్నవ, చెంఘీజ్‌ఖాన్‌పేట, లింగారావుపాలెం, జగ్గాపురం, జాలాది, దింతెనపాడు, సందెపూడి తిమ్మాపురం, మైదవోలు, కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లోని రామాలయాలు, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. సీతారాముల కల్యాణ వేడుకలను భక్తిప్రపత్తులతో తిలకించారు. ధర్మకర్తలు, నూతన దంపతులు పీటలపై కూర్చొని పూజలు నిర్వహించారు. పలుచోట్ల స్వామి కల్యాణం అనంతరం పానకం, వడపప్పు ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు జరిపారు. బోయపాలెం రామాలయంలో 9వ వార్షికోత్సవం బోయపాలెం సీతారామస్వామి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవమి శాంతి కల్యాణం జరిగింది. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈపూరు: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈపూరు, ఊడిజర్ల, ముప్పాళ్ల, కొండ్రముట్లలో వేడుకలు అంబరాన్నంటాయి. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిపారు. గణపవరంలో రూ.2 కోట్లతో నిర్మించిన రామాలయంలో పూజలు నిర్వహించి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. మువ్వావారి వీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో కల్యాణం నిర్వహించి అన్నదానం చేశారు. శాంతినగర్ కోదండ రామాలయంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో కొలువైఉన్న అక్కాయగుంట సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, నూజెండ్లపల్లి అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి వివేక్, దేవస్థాన కమిటీ చైర్మన్ మండపాటి రామకృష్ణంరాజు ఉదయాన్నే స్వామివారిని అలంకరించి ఆకుపూజాభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. 200 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ ఆలయానికి భక్తులు పోటెత్తారు. గ్రామస్తుల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇర్లపాడు, ఎండుగుంపాలెం గ్రామం, రాజుపాలెం, బుక్కాపురం, గంగన్నపాలెం నుంచి మొక్కుబడుల ప్రభలు తరలివచ్చాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్, సీతయ్యనగర్, హనుమాన్‌నగర్, కొత్తపేట తదితర దేవాలయాల్లో చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం జరిపించారు. వడపప్పు, పానకం, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీరామనవమి వేడుకల్లో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే

నరసరావుపేట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం రామిరెడ్డిపేటలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఇటీవల వివాహం జరిగిన ఆయన కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి దంపతులతో స్వామివారికి కల్యాణం చేయించారు. కార్యక్రమంలో మానవహక్కుల కమిషన్ మాజీ ఉమ్మడి రాష్ట్ర చైర్మన్ కాకుమాను పెదపేరిరెడ్డి, కాకుమాను ఫౌండేషన్ చైర్మన్ కాకుమాను సదాశివరెడ్డి, ఇనగంటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



వి.రెడ్డిపాలెంలో పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఘనంగా పాటిమీద ఆంజనేయస్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్

రొంపిచర్ల: వడ్లమూడివారిపాలెం గ్రామ సమీపంలోని పాటిమీద ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి, స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి నాడు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రికి గ్రామస్తులు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవోపేతంగా శ్రీరామ శోభాయాత్ర

జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శోభాయాత్రను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పొడా చైర్మన్ మిట్టపల్లి

నరసరావుపేట: శ్రీరామనవమి సందర్భంగా గురువారం సాయంత్రం పట్టణంలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్రను వైభవోపేతంగా నిర్వహించారు. సత్తెనపల్లి రోడ్డులోని వాసవి కాంప్లెక్స్ నుంచి వందలాది మంది భక్తులు తలలకు కాషాయ వస్త్రాలు ధరించి, శ్రీరామచంద్రుడి ముద్రలతో ఉన్న జెండాలు చేతబూని ద్విచక్ర వాహనాలతో ప్రారంభమైన శోభాయాత్రకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే కూడా ద్విచక్ర వాహనంపై వందలాది మంది భక్తులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. వినుకొండ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రతి ఒక్కరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సింధూ స్కూల్ అధినేత కొత్త రామకృష్ణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్త సాయికృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వక్కలగడ్డ సురేష్, ఎస్‌కే ఆంజనేయులు, దివ్వెల రామకృష్ణ, నిడమానూరి సురేంద్రబాబు, మాడిశెట్టి మోహనరావు, శ్రీరామ ఉత్సవ సమితి సభ్యులు బుద్ధ ప్రహ్లాద, పులికొండ జయ, ఇయం స్వామి, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ రాములు, నాయకుడు బొల్లా గిరిబాబు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



గణపవరం శాంతినగర్ కోదండరామాలయంలో కల్యాణ వేడుకల్లో భక్తులు



బోయపాలెం రామాలయంలో 9వ వార్షికోత్సవం పూజలు



కొత్తపాలెం రామాలయంలో కల్యాణ వేడుకల్లో గ్రామస్తులు

చైతన్య గోదావరి బ్యాంకు 247వ శాఖ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు, అధికారులు

నరసరావుపేట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సత్తెనపల్లిరోడ్డు బరంపేట మూడు బావుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 247వ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నరసరావుపేట రూరల్ బ్రాంచ్‌ను గురువారం ఆ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంక్ శాఖ సేవలను నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిస్తూ గ్రామీణ బ్యాంకుల్లో ప్రప్రథమంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్య, తనఖా, భూమి కొనుగోలు వంటి అన్నిరకాల రుణాలు, అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు. తమ బ్యాంకు ప్రస్తుతం నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు, 247 శాఖల ద్వారా పనిచేస్తూ రూ.8,070 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి, రూ.9,600 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. రూ.200 కోట్లకు పైగా లాభాన్ని ఆర్జించిందన్నారు. ఇసప్పాలెం మహంకాళీ అమ్మవారి దేవస్థానం ఎండోమెంట్ అధికారి టి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులోనే అన్నీ బ్యాంకుల కన్నా డిపాజిట్లపై అత్యధిక వడ్డీ వస్తుందని పేర్కొన్నారు. నరసరావుపేట ప్రాంతీయ మేనేజర్ పి.మారుతీరామ్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజలందరూ తమ సేవలను వినియోగించుకుని, తాము అభివృద్ధి చెందుతూ, బ్యాంకు అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. తమ బ్యాంకులోనే గ్రాము బంగారానికి అత్యధికంగా రూ.4,150 చొప్పున రుణం అతి తక్కువ వ్యవధిలోనే ఇస్తున్నామని పేర్కొన్నారు. అక్షర నర్సింగ్ హోం డాక్టర్ సప్రంరామ్‌ప్రసాద్, న్యాయవాది నంద్యాల సత్యనారాయణరెడ్డి, ఇంజినీర్ కె.కమలాకరరెడ్డి, బ్యాంకు హెడ్ ఆఫీస్ ముఖ్యఅధికారి ఓ.అంజనేయులు, ఆడిటర్ మురళీకృష్ణ, శాఖాధికారి సాయి సునీల్, క్యాషియర్ ఓ.మహేష్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యకుమార్, రామబ్రహ్మం, సత్యనారాయణ, అరవింద్, ఆమని, కోటేశ్వరరావు, సాంబశివనాయక్, యమలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

125 మందికి ఉచితంగా కంటి పరీక్షలు



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో గురువారం గ్రామానికి చెందిన సయ్యద్ మీరావలి ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, ధూళిపాళ్ల సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందికి కంటి పరీక్షలు చేశారు. విజన్ సెంటర్ కో–ఆర్డినేటర్ మల్లేష్, ఫీల్డ్ స్టాఫ్ రత్నకుమార్, సునీత రోగులను పరీక్షించారు. కంటి శుక్లాలు ఉన్నవారు 35, కళ్లజోళ్లు కావాల్సిన వారు 45, కంటి సంబంధిత సమస్యలున్నవారు 40 మంది ఉన్నట్లు గుర్తించారు. కంటిశుక్లాలకు ఉచితంగా ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్స్‌పల్ పానెం శ్రీనివాసరెడ్డి, సోముమస్తాన్‌రెడ్డి, కైపురామకృష్ణరెడ్డి, సయ్యద్ రహీం, మర్రి శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన్ స్కూల్ మస్తాన్‌వలి, మాజీ సర్పంచ్ సయ్యద్ అల్లాబక్షు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌కు సన్మానం

నకరికల్లు: నర్సింగపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నకరికల్లుకు చెందిన కొమ్మవరపు వెంకటసాయి హరీష్‌బాబు గురువారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించారు. హరీష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం, కాశీవిశ్వేశ్వరస్వామి కృపతో తన లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మవరపు శివ ప్రసాద్, సువర్చలాదేవి, వెంకటసాయి మోహనకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.